తాగునీటి చెరువులో చేపల మృత్యువాత



నల్లచెరువులో మృత్యువాత పడ్డ చేపలను వెలికితీస్తున్న సిబ్బంది



యానాంలో 15 ఎకరాల్లో విస్తరించిన నల్లచెరువు

- ఆక్సిజన్ అందకపోవడమే కారణం
- ఏరియేటర్లు పెట్టాలని మత్స్యశాఖ సూచన

యానాం: పట్టణానికి తాగునీరు అందించే నల్లచెరువులో శనివారం వందలాదిగా చేపలు మృత్యువాత పడటం అందరినీ విస్మయానికి గురి చేసింది. దీంతో ఆ పరిసర ప్రాంతమంతా దుర్వాసన వ్యాపించడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ) నిర్వహణలో ఉన్న 15 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చెరువులో కాలువల ద్వారా వచ్చిన నీటిని నిల్వ ఉంచి అవసరమైన సందర్భాల్లో ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం నల్లచెరువు పక్కనే మరో పెద్ద చెరువు ఉండటంతో ఈ చెరువును పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులో చేపలు పట్టుకోవడానికి వేలం నిర్వహించాల్సి ఉన్నా పీడబ్ల్యూడీ అధికారుల నిర్లక్ష్యంతో 15 ఏళ్లుగా అలాగే వదిలేశారని పలువురు ఆరోపించారు. చెరువులో చేపలు చనిపోవడంతో చెరువు అంతా విషతుల్యంగా మారిందని గ్రామ పెద్దలు చెప్పారు.

పీడబ్ల్యూడీ అధికారుల నిర్లక్ష్యం వల్లే..

పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహణలో ఉన్న రక్షిత మంచి నీటి చెరువుల విషయంలో పీడబ్ల్యూడీ అధికారులు పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్థానికులు సలాది సత్యకృష్ణ, పెద్దిరెడ్డి బాబి, డి.అనిత తదితరులు ఆరోపించారు. 55 ఎకరాల చెరువులో నిత్యం గేదెలు ఉంటున్నాయన్నారు. మందు బాబులంతా చెరువు గట్లపై చేరి మద్యం సేవించి బాటిళ్లను చెరువులో విసిరేస్తున్నారన్నారు. నల్ల చెరువును నిర్లక్ష్యం చేయడం వల్ల చేపలు మృత్యువాత పడి నీరు విషతుల్యంగా మారిందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

ఆక్సిజన్ అందకే..



నల్లచెరువులో ఆక్సిజన్ అందక అధిక సంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డాయి. చనిపోయిన చేపలను తొలగించేలా చిన్న పడవలను ఏర్పాటు చేశాం. రక్షిత మంచి నీటి చెరువుల్లో ఏరియేటర్స్ పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. తద్వారా ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవు.

– దడాల గొంతియ్య, మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

ముమ్మిడివరం: పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో ఏడాది కాలం పాటు ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు పారా లీగల్ వలంటీర్లను నియమిస్తున్నామన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండినవారు జూన్ 15వ తేదీలోపు మండల న్యాయ సేవాధికార కమిటీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సేవా దృక్పథం కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు సమాజ సేవ అలవరచుకోవాలి



ఉప్పలగుప్తంలో ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం: విద్యార్థులు చిన్న వయసు నుంచే సమాజసేవ అలవరచుకోవాలని అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు అన్నారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న పలు కళాశాలల విద్యార్థులకు ఎస్పీ సుసరాపు శ్రీధర్ అందించిన ప్రోత్సాహకాలను ఆయన ఎస్ఐ కేఎం జోషితో కలసి ఉప్పలగుప్తం పోలీస్‌స్టేషన్‌లో శనివారం అందజేశారు. పోలీసులకు సహాయకులుగా వలంటీర్ సేవలు అందించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, రూ.500 నగదును అందించి అభినందించారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



కల్యాణ దుర్గ ఆలయంలో లక్ష కుంకుమార్చన చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వేంచేసి ఉన్న కల్యాణ దుర్గ అమ్మవారి ఆలయ 28వ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన పూజ శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ భక్తులకు పూజా సామాగ్రి సమకూర్చింది. కుంకుమార్చన అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని పూలమాలలు, మామిడి తోరణాలతో మంగళప్రదంగా ముస్తాబు చేశారు.

కేశవస్వామి ఆలయంలో భారీ అన్నదానం

తాళ్లరేవు: శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. వారం రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సహకరించిన వారందరికీ ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముందస్తు నాట్లకు సిద్ధం కావాలి



ఖరీఫ్ సాగుపై అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ఖరీఫ్‌లో ముందస్తు నాట్లు వేసేందుకు రైతులను సమాయత్తం చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఖరీఫ్ సాగుపై వ్యవసాయం, రెవెన్యూ, డ్రైయిన్స్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో రుతుపవనాలు ఏపీకి రాకతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఖరీఫ్ పంట కాలానికి ముందస్తు నాట్లు వేసుందుకు రైతులను సిద్ధం చేయాలన్నారు. అలాగే భారీ వర్షాలు కురిస్తే బోడసకుర్రు, గోపాయిలంక, గోడి, బెండమూర్లంక, లంక గ్రామాల్లో వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏటిగట్లని ఈ నెల 29లోగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆయా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఖరీఫ్‌లో ముంపు లేకుండా ఉండేందుకు పంట కాలువలు పరిశీలించి కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపునకు చేయాల్సిన పనులను ఈ నెల 31 లోగా గుర్తించాలని వీఆర్ఓ, వ్యవసాయ సహాయకులకు సూచించారు. ముంపునకు ప్రతిబంధకంగా ఉన్న రామేశ్వరం మొగని పరిశీలించి పూడికతీత పనులకు ప్రాథమిక అంచనాలు సిద్ధం చేయాలని డ్రైయిన్ అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ, డ్రైయిన్స్ ఏఈ సునీతాదేవి, ఇరిగేషన్ ఏఈ రెహమాన్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ యువజన వారోత్సవాల ప్రారంభం



నృత్య ప్రదర్శనలతో ప్రతిభ చాటిన చిన్నారులను అభినందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకూ జరగనున్న రోటరీ యువజన వారోత్సవాలను క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి నాగభూషణం ప్రారంభించారు. విజేతలకు జూన్ 8వ తేదీన స్థానిక రోటరీ కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందించనున్నట్లు వారోత్సవాల చైర్మన్ ఆకొండి పవన్ తెలిపారు. తొలి రోజు శనివారం విద్యార్థులకు శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. క్లాసికల్, సోలో, గ్రూపు ఇలా మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి. రెండో రోజు వెస్ట్రన్ డ్యాన్స్, మూడో రోజు డ్రాయింగ్, నాలుగో రోజు షటిల్ బ్యాడ్మింటన్, అయిదో రోజు భక్తి సంకీర్తనలు, ఆరో రోజు చదరంగం పోటీలను నిర్వహిస్తామన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి విద్యార్థులకు రోజుకో పోటీ జరుగుతుందన్నారు. రోటరీ క్లబ్ పట్టణ కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటిన చిన్నారులను రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీఖాకోళ్లపు రామ సతీష్, కోశాధికారి కూచిమంచి శశిధర్ శ్రీరామ్, వారోత్సవాల కమిటీ చైర్మన్ పవన్‌లు అభినందించారు.

వెంకన్నకు ఉయ్యాల సేవ



ఉయ్యాల సేవలో పాల్గొన్న ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి, ఫణి దంపతులు



బండారులంకలో వేంకటేశ్వర స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో వందలాది మంది భక్తుల సమక్షంలో శనివారం ఉయ్యాల సేవ నిర్వహించారు. ప్రతి శనివారం ఓ దంపతుల జంట స్వామి వారికి ఉయ్యాల సేవ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి పుట్టిన రోజు సందర్భంగా పట్టణ వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి దంపతుల చేతుల మీదుగా ఉయ్యాల సేవ శాస్త్రోక్తంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, ఆలయ ధర్మకర్తలు యెండూరి రాఘవ, ముంగర ప్రసాద్, కాశే చంటి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వెంకన్న పెళ్లి కొడుకాయెనే

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. ముత్తైదువులచే సాంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో రోలు, రోకలితో పసుపు పోటు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య అత్యంత వైభవంగా తిరుచ్చి సేవ జరిపారు. బిళ్లవారి వీధి నుంచి ప్రారంభమై ఎగ్జిబిషన్ స్ట్రీట్, వీరభద్ర స్వామి గుడి సెంటర్ మీదుగా వీరభద్రపురం, శివాలయం వీధి వరకూ తిరుచ్చి సేవ సాగింది. దారి పొడవునా మహిళలు మంగళహారతులు సమర్పించారు. పేరంటాలు గడప గడపకూ వెళ్లి బొట్టు పెట్టి దేవదేవేరుల కల్యాణానికి పెండ్లి పిలుపు నిర్వహించారు. అనంతరం 2000 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు అంకం హిమ భారతి, గుత్తుల జానకీలక్ష్మి, మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీనివాస బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, బళ్ల సత్తిరాజు, లంకాడి రాము, కటకం గణేష్, బాసిన కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై అమలాపురం తాలూకా పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3,100 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు.

ఉసురు తీసిన కలహాలు



శ్రీధర్, దేవి మృతదేహాల వద్ద బంధువు రోదన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కుటుంబ కలహాల కారణంగా అనుమానాస్పదంగా దంపతులు మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ఆనంద్‌నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. అయితే సంఘటనా స్థలంలో ఆధారాలను బట్టి భార్యను చంపి భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. జగ్గంపేటకు చెందిన శ్రీధర్ (28)కు ప్రత్తిపాడుకు చెందిన దేవి (22)కి ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడేళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉన్నారు. తాపీ పనిచేసుకునే శ్రీధర్‌కు ఏడాది కిందట ప్రమాదం జరగడంతో వేరొకరిపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. భార్య దేవికి ఫిట్స్ ఉన్నాయి. ఇదిలా ఉండగా భార్యాభర్తలు తరచూ ఘర్షణ పడేవారు. ఈ నేపథ్యంలో భార్య దేవి నెలరోజుల కిందట పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను కాపురానికి తీసుకు వచ్చేందుకు శ్రీధర్ వారం కిందట అత్తారింటికి వెళ్లాడు. పిల్లలను ప్రత్తిపాడులో వదిలేసి భార్యాభర్తలిద్దరూ కలసి ఆనంద్‌నగర్‌లోని ఇంటికి శనివారం ఉదయం 10.30 గంటలకు వచ్చారు. వస్తూ శ్రీధర్ వెంట మద్యం బాటిల్ తెచ్చుకున్నాడు. అప్పటి నుంచి మధ్యాహ్నం వరకూ తలుపు వేసి ఉండడం, ఇంటి లోపలకు వెళ్లిన వారు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు తలుపులు ఎంత తట్టినా తీయలేదు. అనుమానం వచ్చి ఇంటి వెనుకవైపు నుంచి వెళ్లి తలుపులు తీసి చూడగా భార్యాభర్తలిద్దరూ విగతజీవులుగా పడి ఉన్నారు. దీంతో ఈ విషయాన్ని మూడో పట్టణ పోలీసులకు తెలిపారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. దేవి మెడకు చున్నీ ఉండడం, ఆమె కిందపడిపోవడంతో ఆమెను చంపి శ్రీధర్ ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను సీఐ వీరయ్య గౌడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఊడిమూడి ప్రమాదంలో ఆరుకు చేరిన మృతులు

- ఆర్టీసీ బస్సు కండక్టర్ మృతి
- ఆదుర్రులో విషాద ఛాయలు



శ్రీనివాసరావు (ఫైల్)

పి.గన్నవరం: రాజవరం- పొదలాడ రోడ్డులో ఊడిమూడి గ్రామం వద్ద ఇటీవల ధాన్యం లోడు ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బస్సు కండక్టర్ కడలి శ్రీనివాసరావు (52) శుక్రవారం రాత్రి చెందారు. దీంతో ఈ ప్రమాద మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఈ నెల 14వ తేదీ సాయంత్రం పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామం వద్ద రోడ్డు పక్కన పది మంది కూలీలు ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలు లోడ్‌చేసి పగ్గాలు కడుతుండగా.. రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యవసాయ కార్మికులు జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యనారాయణ, ఈరి కట్లయ్య, ఆదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు అక్కడికక్కడే మృతి చెందగా, మణిబాబు సోదరుడు చిలకలపూడి సురేష్ కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న కండక్టర్ ఎగిరి ఫుట్‌పాత్‌పై పడిపోయాడు. ప్రమాదంతో ఆందోళనకు గురైన బస్సులోని ప్రయాణికులు ఫుట్‌పాత్‌పై పడిఉన్న కండక్టర్‌ను గమనించకుండా అతడిపై నుంచి కిందకు దిగిపోయారు. ఇలా తీవ్ర గాయాలపాలైన కండక్టర్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కండక్టర్ మృతితో ఆయన స్వగ్రామమైన మామిడికుదురు మండలం ఆదుర్రులో విషాదఛాయలు అలముకున్నాయి. కండక్టర్ శ్రీనివాసరావుకు భార్య భవానీ, కుమార్తెలు లోకేశ్వరి, నాగేశ్వరి ఉన్నారు. అతడి మృతదేహానికి శనివారం అమలాపురం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ కేసు నమోదు చేయగా, సీఐ ప్రశాంత కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు కండక్టర్ శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

అమలాపురం రూరల్: పి.గన్నవరం మండలం ఊడిమూడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బస్సు కండక్టర్ కడలి శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలని యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.ప్రకాశరావు కోరారు. శనివారం వారు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ శ్రీనివాసరావు ఆన్‌డ్యూటీలో ఉండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విషమ స్థితికి చేరుకున్నా ఆర్టీసీ నుంచి సరైన వైద్య సహాయం అందలేదని ఆరోపించారు. అతడి కుటుంబసభ్యులు వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు పెట్టినా ఆర్టీసీ నుంచి కేవలం రూ.5,000 మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. డ్రైవర్‌కు సరైన విశ్రాంతి లేకుండా డ్యూటీ వేయడం వల్లే ప్రమాదం జరిగిందని చెప్పారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు నష్ట పరిహారంతో పాటు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని యానాం సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత లేదా సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి నుంచి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీకామ్ జనరల్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బోటనీ కోర్సులు ఉన్నాయన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ ప్రారంభమవుతుందన్నారు. దరఖాస్తులను కళాశాల అన్ని పని దినాల్లో ఇస్తారని, అదేవిధంగా కళాశాల వెబ్‌సైట్ 'ఎస్ఆర్‌కేజీఏసీయానాం.ఈడీయూ.ఇన్' నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులకే వచ్చే నెల 14వ తేదీను తుది గడువుగా నిర్ణయించారన్నారు.